# అన్ని వర్గాలకు రాజ్యాధికారం దక్కాలి

■ప్రజల స్థితిగతులను మార్చడానికే కుల గణన
■ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


పాపిరెడ్డిగూడలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబర్ 4: తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాధికారం దక్కాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల స్థితిగతులను మార్చాలనే ధృడ సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కుల గణన చేపట్టిందని వివరించారు. ఇప్పటికీ చాలా మంది ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్నారని, వారికి ప్రభుత్వ సహాయం అందడం లేదని తెలిపారు. సుమారు 120 నుంచి 160 కులాలకు ఇప్పటికీ గుర్తింపులేదన్నారు. ఆ కులాల పేదలకు సంక్షేమ పథకాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా సామాజిక అంశాల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కుల గణన పూర్తయితే అన్ని వర్గాలకు దక్కాల్సిన హక్కులు దక్కుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు తాండ్ర విశాల, వెంకట్రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, జగదీశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

**ఆదర్శ మున్సిపాలిటే లక్ష్యం**

**షాద్‌నగర్‌టౌన్ :** షాద్‌నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని 9వ వార్డులో నూతన అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ పనులకు మున్సిపల్ సా ధారణ నిధులు రూ.10లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బస్వం, ము బారక్‌ఖాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు**

**షాద్‌నగర్‌రూరల్ :** పత్తి కొనుగో ళ్లు పారదర్శకంగా జరిగేలా చూడాలని ఎమ్మె ల్యే వీర్లపల్లి శంకర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రిలో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతుల ఇబ్బందులను తొలగించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజుగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

**హాజిపల్లిలో..**

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ టీ వరల్డ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, భార్గవ్‌కుమార్, అశోక్, తుపాకుల శేఖర్ పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి


హైతాబాద్ గ్రామస్తులకు విరాళం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, నవంబర్ 4: ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో హైతాబాద్ గ్రామస్తులు అవినాశ్‌రెడ్డిని కలిసి ఈ నెల 11నుంచి 13వరకు గ్రామంలో నిర్వహించే మహంకాళి, బీరప్ప, మల్లన్న ఆలయాల్లో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం ఆలయాల అభివృద్ధి కోసం ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ గో పాల్, నాయకులు కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


లక్ష్మారెడ్డి పాలెంలో సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న కౌన్సిలర్లు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 4: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ సిద్దెంకి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పెద్ద అంబర్‌పేటలోని లక్ష్మారెడ్డి పాలెంలో రూ.20 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చల్లారి మురళీధర్‌రెడ్డి, దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, మున్సిపల్ డీఈఈ శివానందం, నాయకులు విజయేందర్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, దేశ్‌ముఖ్ సాయిబృందావనం ఆలయ చైర్మన్ నారాయణస్వామి, కాలనీ ప్రతినిధు లు తదితరులు పాల్గొన్నారు.

## 9న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న చిక్కుడు గుండాలు

యాచారం, నవంబర్ 4: ఇబ్రహీంపట్నంలో ఈ నెల 9న నిర్వహించే మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు చిక్కుడు గుండాలు అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలంతా తమ హక్కులను సాధించుకునేందుకు ముందుకు రావాలన్నారు. త్వరలో గ్రామ, మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి మాలలను ఐక్యం చేయాలని కోరారు. కార్యక్రయంలో జిల్లా అధ్యక్షుడు బండి మహేశ్, కోకన్వీనర్ జగన్, మనోజ్‌కుమార్, మాదరి శివకుమార్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## రాయపోల్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం


సదర్ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 4: మండల పరిధిలోని రాయపోల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులు ఎంతో వైభవంగా జరుపుకొనే సదర్ పండుగ ఆనవాయితీగా వస్తున్నదన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు జగదీశ్‌యాదవ్, శ్రీరాం, మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, బాలరాజు, గ్రామస్తులు దొండ రమణారెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం


పోలీస్‌స్టేషన్‌లో విఖిల్‌ను సన్మానిస్తున్న ఎస్సై వెంకటేశ్, సిబ్బంది

ఆమనగల్లు, నవంబర్ 4: మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన వడ్త్యావత్ విఖిల్ ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విఖిల్‌ను ఎస్సై వెంకటేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

షాబాద్, నవంబర్ 4: రైతుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలోభారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీకేఎస్ బలోపేతానికి గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో ఏఈ కోటేశ్వర్‌రావును కలిసి రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, మల్లేశ్, చంద్రబాబు, బేగరి వినోద, సత్యం, చిన్నయ్య, కృష్ణయ్య, అచ్చిని ఇందిరమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, నవంబర్ 4: మున్సిపాలిటీ పరిధిలోని జానంపేట వీరాంజనేయ స్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ ఆవిష్కరించారు. తన నివాసంలో జానంపేట నివాసుల సమక్షంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. జానంపేటలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించి మరోమారు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్, జానంపేట వాసులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి

షాద్‌నగర్, నవంబర్ 4: ఎస్సీ వర్గీకరణను అన్ని వర్గాల దళితులు వ్యతిరేకించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మహేశ్‌మాల పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన మహేశ్‌మాల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆ యన మాట్లాడుతూ.. దళిత జాతికి అన్యాయం జరిగేలా ఓ వర్గం నేతలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. కొం దరు నేతలు దళితులను విడదీసేందుకు కుట్రపన్నుతున్నారని, దళితుల సంక్షేమం కోసం పోరాటం చేయాలే తప్పా దళితుల మధ్య దూరం పెంచి వారి ఎదుగుదలను అడ్డుకోవడం సరికాదన్నారు.

## సాగర్ ఎన్‌క్లేవ్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక


వెంకటయ్య, అధ్యక్షుడు

తుర్కయాంజాల్, నవంబర్ 4: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడ సాగర్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా వెంకట య్య, కార్యదర్శిగా ఈశ్వరయ్య,కోశాధికారిగా కొండల్‌రెడ్డిలను ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డిని నియమించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 4: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటిస్తున్నారని మున్సపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమాలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు జరుగుతాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

## ఆటోను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు

యాచారం, నవంబర్ 4: కూలీలతో వెళ్తున్న ఆటోను వెనకాల నుంచి కారు ఢీకొట్టడంతో ముగ్గురు మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. అదే క్రమంలో ముందు నుంచి వెళ్తున్న మరో బైకును కారు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన యాచారం మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన 14 మంది మహిళా కూలీలు మాడ్గుల మండల పరిధిలో పత్తి తీసేందుకు వెళ్లి పని ముగించుకొని తిరిగి ఆటోలో వస్తున్నారు. మండల కేంద్రంలోని డీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్దకు రాగానే మాల్ నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను వెనకాల నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బుచ్చమ్మ (40), యాదమ్మ (38), అండాలు (36) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. వీరిలో బుచ్చమ్మ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో మరో 10మందికి కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరు మాల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కారు ఆటోను ఢీకొన్న క్రమంలో మరో బైకు ప్రమాదానికి గురైంది. బైకుపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థి అదృశ్యం


సందీప్

ఆదిబట్ల, నవంబర్ 4: పాఠశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి అక్కడికి వెళ్లకుండా అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాలు.. బాలాపూర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన ముడావత సందీప్ ఆదిబట్ల చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరాడు. రాత్రి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పాఠశాలకు చేరుకున్నట్లు చెప్పాడు. మరు రోజు పాఠశాల యాజమాన్యం సందీప్ పాఠశాలకు రాలేదని చెప్పారు. వెంటనే సందీప్ తండ్రి శంకర్ పాఠశాలకు వెళ్లి విచారించారు. స్కూల్ బయటి నుంచి క్యాంటీన్‌లో పని చేసి వారి ఫోన్ చేసి వెళ్లాడని తెలిపారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


యాచారం :మాట్లాడుతున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, నవంబర్ 4: మండల పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు కులగణనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వేను విజయవంతం చేయడానికి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు శిక్షణ**

**ఆమనగల్లు :** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఎంఈవో పగిడిపాల పాండు పాల్గొన్నారు.

**చేవెళ్లలో..**

**చేవెళ్లటౌన్ :** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హిమబిందు, ఎంఈవో, ఎంపీవో విఠలేశ్వర్‌జీ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ఆందోళన


విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పోలీసులు

మొయినాబాద్, నవంబర్ 4: సమస్యలు పరిష్కరించాలని గురుకుల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మండల పరిధిలోని పెద్ద మంగళారంలో ఉన్న ఆజాద్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కోడింగ్ పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తగినంత మంది ఉపాధ్యాయులు లేరని, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తదితర సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారని, ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. కోడింగ్ విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 9 మంది ఉపాధ్యాయులను నియమిస్తూ ప్రభుత్వం 8 రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులతో పాటు శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న 5, 6, 7 తగరతులకు చెందిన 229 మంది విద్యార్థులను కోడింగ్ పాఠశాలలో కలిపారు. వచ్చిన ఉపాధ్యాయులు శంకర్‌పల్లి పాఠశాల విద్యార్థులతో పాటు కోడింగ్ పాఠశాలలో ఉన్న 220 మంది విద్యార్థులకు విద్యా బోధన చేపడుతున్నారు. కోడింగ్ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు కావడంతో విద్యార్థులకు సమస్యలు మొదలయ్యాయని తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో, పాఠశాల ఇన్‌చార్జి సౌభాగ్యవతితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

## బైకు దొంగల అరెస్టు..


పోలీసుల అదుపులో దొంగలు, స్వాధీనం చేసుకున్న బైకులు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 4: బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై మూల ఆజేందర్, గగులోతు అంజి వెళ్తున్నారు. ఆ వాహనాన్ని ఆపి పేపర్లు చూయించమని అడుగుతుండగా పారిపోయారు. అనుమానం వచ్చి వారిని అదుపులోకి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. వారు ఆరు నెలల క్రితం పరిచయమై స్నేహితులుగా మారారు. ఈ క్రమంలో వీరు మద్యం, సిగరెట్లతో జల్సాలకు అలవాటు పడి డబ్బులు లేకపోవడంతో ఇద్దరు బైకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. నాదర్‌గుల్, ఇబ్రహీంపట్నం, బీఎన్ రెడ్డి, లష్కర్‌గూడ, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో బైకులను అపహరించారు. వాహనాల తనిఖీలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పల్సర్ బైకును సీజ్ చేశారు. ఎన్జీవోఎస్ కాలనీలో బైక్‌ను దొంగతనం చేసి తర్వాత విక్రయించేందుకు ఓ దగ్గర దాచి పెట్టారు. మరో బైక్‌ను దొంగతనం చేసేందుకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరు దొంగతనం చేసిన బైకులను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

## ఆలయాలకు కార్తిక శోభ


తట్టిఅన్నారంలోని శివాలయంలో అభిషేకం చేస్తున్న పూజారులు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 4: కార్తికమాసం మొదటి సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అభిషేకాలు చేశారు. పెద్దఅంబర్‌పేటతోపాటు కుంట్లూరు, తట్టిఅన్నారం, మర్రిపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో సూర్యోదయానికి ముం దే పలువురు భక్తులు దీపాలు వెలిగించారు. తట్టిఅన్నారంలోని శ్రీలలిత భువనేశ్వరీ సమే త చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కే మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్


నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ జడ్పీటీసీ అనురాధ, బీఆర్‌ఎస్ నాయకులు


ఆమనగల్లు, నవంబర్ 4: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా మోసం చేస్తున్నదని మాజీ జడ్పీటీసీ అనురాధాపత్యానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డును ఆమె స్థానిక నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా వరి, పత్తికి మ ద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వరి, పత్తికి మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మాడ్గుల మండల అధ్యక్షుడు లాలయ్యగౌడ్, నాయకులు పత్యానాయక్, బాలస్వామి, రమేశ్‌నాయక్, వెంకటేశ్, శివ కుమార్, యాదయ్య, ప్రసాద్, గణేశ్, ఆనంద్, మహేశ్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో హీర్యానాయక్ తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 4: జ్ఞాన విజ్ఞాన వేదిక, టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్‌ను సోమవారం ఇబ్రహీంపట్నం ఎంఈవో హీర్యానాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. ఈ నెల 7న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారని, 21న మండల స్థాయిలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, మండల బాధ్యులు నర్సింహ, శ్రీనివాస్, రవీందర్, అరుణ, భాగ్యశ్రీ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సహకారం సంఘం చైర్మన్ భరత్‌కుమార్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 4: మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బుడిగ శివ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ మృతుడి భార్య భారతికి రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలో సభ్యులెవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి సంఘం తరపున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చిన్నయాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేశ్‌యాదవ్, నాయకులు జంగమయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంనగర్‌లో ఉచిత వైద్య శిబిరం


మధుమేహం నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మొయినాబాద్, నవంబర్ 4: మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్‌లో ఉన్న జిమ్స్ వైద్య కళాశాల, దవాఖాన ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వంద మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మధుమేహం నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు విరాట్‌కుమార్,హనుమంతు,పావని, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌శీను

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 4: విద్యార్థులకు నేరాల నియంత్రణపై అవగాహన ఉండాలని ఎస్సై వెంకట్‌శీను అన్నారు. గుంతపల్లిలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ఉమెన్, ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ) రాచకొండ ఆధ్వర్యంలో డీసీపీ మురళీధర్ సూచన మేరకు సోమవారం నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌వో శ్రీనివాస్‌నాయుడు, ఏఎస్సైలు అనురాధ, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న నర్మద

మొయినాబాద్, నవంబర్ 4: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నర్మద అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న ఎన్‌టీఆర్ మోడల్ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్, కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నర్మదతో పాటు ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ మార్షల్ ఆర్ట్ ట్రైనర్ ఎన్టీఆర్ ట్రస్ట్ డీన్ ఎంవీ రామారావు, డైరెక్టర్ కోటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పలు సలహాలు ఇచ్చారు.

## ఆరుట్లలో ఎల్‌ఈడీ వీధి దీపాలు ఏర్పాటు


ఆరుట్లలో ఎల్‌ఈడీ లైట్లను చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచాల, నవంబర్ 4: మండల పరిధిలోని ఆరుట్లలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిధులతో 50 ఎల్‌ఈడీ లైట్లను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ప్రధాన రోడ్ల వెంట ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి శ్రీనివాస్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.